

నేత్ర దానంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కురుపాం

ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు 38 వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు సందర్భంగా స్థానిక సిహెచ్‌సిలో నేత్ర వైద్య అధికారి డాక్టర్ నగేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు వీధుల్లో తిరుగుతూ నేత్రదానం అంటే ఏమిటి, దానిపై ఉన్న అపోహలు, నేత్రదానం ఎప్పుడు చేయాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయకులు శైలజ, రోజా, మల్లిక, వనిటిసి కౌన్సిలర్ మోహనరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సమరభేరి

నేటి నుంచి ఆరు రోజులపాటు సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రజా సమస్యల పరిష్కారానికై సిపిఎం ఆధ్వర్యాన బుధవారం నుంచి సెప్టెంబర్ 4 వరకు ఆరు రోజులపాటు సమరభేరీ మోగించనున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంగతి తెలిసిందే. సమస్యలను పరిష్కరించాలని, భారాలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సమరభేరి నిర్వహించేందుకు పార్టీ పిలుపునిచ్చింది. దీన్ని విజయవంతం చేయాలంటూ సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు తదితరులు ఇప్పటికే పిలుపునిచ్చారు. ఏటా కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కేంద్రం మాట నిలబెట్టుకోలేదు. పైగా అవలంభించిన విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థల్లో అనేక మంది ఉద్యోగాలు కోల్పోయారు. దీంతో, నిరుద్యోగ సమస్యను మరింత తీవ్రతరమైంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి సంస్థలను ప్రైవేటు పరం చేసేందుకు కంకణం కట్టుకుంది. దీంతో, ఉద్యోగులకు మరిన్ని సమస్యలు ఉత్పన్నం కావడంతోపాటు భవిష్యత్ తరాలకు ప్లాంట్‌లో ఉద్యోగ అవకాశాలు లేకుండా పోతాయి. మరోవైపు పెంచిన నిత్యావసర సరుకుల ధరల వల్ల పేద, మధ్యతరగతి ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ ఛార్జీలు, చెత్తపన్ను వంటివి మరింత గుదిబండగా పరిణమించాయి. ఇటీవల పెంచిన విద్యుత్తు ఛార్జీలు కూడా భారమయ్యాయి. జిల్లాలో జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూత వల్ల కార్మికులు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల జిల్లా ప్రజలు వలసలు కూడా ఆగడం లేదు. ఈ నేపథ్యంలో ఈనెల 30న ప్రభుత్వ మోసపూరిత విధానాలపై ప్రచారం, సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1 గ్రామ, వార్డు సచివాలయాల్లో వినతుల సమర్పణ, 3న నిరుద్యోగ వ్యతిరేక దినం, 4న మండల కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు సిపిఎం ఆధ్వర్యాన చేపట్టనున్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సంతకాల సేకరణ

కురుపాం : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మంగళవారం మండల కేంద్రంలో గల రావాడ జంక్షన్ వద్ద సిపిఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరుగుతున్న సంతకాల సేకరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు హాజరయ్యు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో ధరలను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ మతోన్మాద ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు కోసమే సిపిఎం సమరభేరి మోగిస్తుందని, దానిలో భాగంగా సంతకాల సేకరణ సెప్టెంబర్ 1న గ్రామ సచివాలయాల్లో ధర్నా వినతుల సమర్పణ, సెప్టెంబర్ 3న నిరుద్యోగ వ్యతిరేక దినం, సెప్టెంబర్ 4న మండల కార్యాలయంలో వద్ద ధర్నా నిర్వహించడమన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.సింహాచలం, గిరిజన యువత, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

కొమరాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు తలపెట్టిన సమరభేరిని జయప్రదం చేయాలని మంగళవారం స్థానిక జూనియర్ కాలేజీ కూడలిలో గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, నాయకులు ఉపేంద్ర, శివుని నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై తలపెట్టిన ప్రచార భేరిలో భాగంగా సెప్టెంబర్ 1న సచివాలయాల వద్ద, 4న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాలకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరు కావాలని కోరారు.

పాలకొండ రూరల్: కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఈనెల 30 నుండి సెప్టెంబర్ 4 వరకు జరిగే సిపిఎం సమరభేరిలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు దూసి దుర్గారావు పిలుపునిచ్చారు. మండలంలోని వెలగవాడలో సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కె. సింహాచలం, బి. అంకమ్మ, కె. రాము, డి. జగన్నాథం, కె.మగతయ్య, ఎస్. శంకర్రావు, ఎస్. రాములు తదితరులు పాల్గొన్నారు.

భామిని : .కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలా ప్రజా వ్యతిరేక విధానాల నిరసిస్తూ ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు తలపెట్టిన సమరభేరిని జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ జి.జగన్నాయుకులు, కె.మిన్నారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని ఘనసర అంబేద్కర్ విగ్రహం వద్ద సమర భేరి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై తలపెట్టిన ప్రచార భేరిలో భాగంగా సెప్టెంబర్ 1న సచివాలయాల వద్ద, 4న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాలకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జి.అప్పారావు ఉన్నారు.



కురుపాంలో సంతకాలు సేకరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ లో ధాన్యం సేకరణకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో మంగళవారం జరిగింది. ధాన్యం సేకరణకు గోనె బస్తాలను ముందస్తుగా సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. అక్టోబరు నెలాఖరుకు 25 లక్షల గోనె బస్తాలను సిద్ధం చేయాలని, అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని, సిబ్బంది నియామకం పూర్తి చేయాలని ఆదేశించారు. యాప్‌ల వినియోగంలో సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. కూలీలు, రవాణాకు కార్యాచరణ ప్రణాళిక ఉండాలన్నారు. చెల్లింపుల యాప్‌లో నమోదు చేయాల్సిన వాహనాల వివరాలు సేకరించి ముందుగా నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాంక్ గ్యారంటీ నిర్దేశిత సమయంలో ఇవ్వాలని సూచించారు. గత ఏడాది అనుభవాల దృష్ట్యా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, అందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మిల్లర్లు, రవాణా, గోనె సంచులు, బ్యాంక్ గ్యారంటీ తదితర అంశాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్ మాట్లాడుతూ 2023 – 24 సంవత్సరానికి క్వింటాల్ కు గ్రేడ్ – ఏ రకం రూ.2203, సాధారణ రకంకు రూ.2183గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. వ్యవసాయ గణాంకాల ప్రకారం సాధారణ పంట విస్తీర్ణం 1,74,632 ఎకరాలు కాగా, 1,41732 ఎకరాలలో ఊబాలు పూర్తి అయ్యాయని వివరించారు. 18094 ఎకరాలకు ఇ-క్రాప్ చేశారని ఆయన చెప్పారు. నవంబరు 15 నాటికి ధాన్యం విక్రయానికి వచ్చే అవకాశం ఉందని వివరించారు. గత ఏడాది 188 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇందులో కేటగిరీ – ఏ లో 52, కేటగిరీ – బి 120, కేటగిరీ – సి లో 16 ఉన్నాయని, వీటిని కొనసాగిస్తామని చెప్పారు. సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేశామని పేర్కొన్నారు. పిఎసిఎస్‌ల ద్వారా 41, గిరి వెలుగు ద్వారా 12, జిసిసి ద్వారా 7, వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా 4, ఎఫ్.పి. ఓ ల ద్వారా 14 నడుపుతున్నట్లు ఆయన చెప్పారు. అన్ని పిపిసిలకు పరికరాలు సిద్ధంగా ఉన్నాయని డి.ఎం తెలిపారు. 47 వెయింగ్ బ్రిడ్జిలు, 129 ఎలక్ట్రానిక్ వేయింగ్ స్కేల్స్ ఉన్నాయని తెలిపారు.

పిఎం కిసాన్ రైతుల వివరాలు నమోదు చేయాలి

రైతులకు ఖరీఫ్ సీజన్ కి పెట్టుబడిసాయం కింద అందించే పిఎం కిసాన్ పథకం వర్తించేందుకు లబ్ధిదారుల ఖాతా నెంబరుకు ఆధార్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణాలు, ఇ – క్రాప్ నమోదు, పిఎం కిసాన్ పథకం వర్తింపు, ఉపాధి హామీ, ప్రాధాన్యతా భవనాలు, రీ సర్వే, తదితర అంశాలపై మండల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భూమి వివరాలను వెబ్ ల్యాండ్‌లో నమోదైనట్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నమోదు కాని పక్షంలో లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందే అవకాశం లేదని, అర్హులైన ప్రతి రైతుకు పథకం వర్తించాలన్నారు. బలిజిపేటలో 1240 వరకు నమోదు జరగాల్సి ఉందని, ప్రత్యేక యాప్‌లో ఆధార్ అనుసంధానం జరగాలన్నారు. మ్యూటేషన్ పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 5లోగా పూర్తి స్థాయిలో యుద్ధప్రాతిపదికన నమోదు ప్రక్రియ జరగాలన్నారు. జిల్లాలో నిర్దేశించిన గృహ నిర్మాణాల లక్ష్యం సాధించేందుకు ఇంటి పైకప్పు స్థాయి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. అక్టోబర్ నెలాఖరు నాటికి లక్ష్యాలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ చట్టం కింద గ్రామాల్లో నిర్వహించనున్న ఎవెన్యూ, బన్డ్ ప్లాంటేషన్ పూర్తికి ఎంపిడిఒ బాధ్యత వహించి శత శాతం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు నెలాఖరుకు రీ సర్వే చేసిన ప్రాంతాల్లో సర్వే రాళ్లు పాతాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే ఓటరు పునశ్చరణ పక్కాగా జరగాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో తప్పు, ఒప్పులకు ఓటరు నమోదు అధికారి (ఇఆర్ఒ)దే పూర్తి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డిఆర్ఒ జె.వెంకటరావు, ఆర్‌డిఒ కె.హేమలత, జిల్లా సహకార అధికారి సన్యాసినాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎన్ మూర్తి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం. శశికుమార్, జిసిసి డివిజనల్ మేనేజర్లు వి. మహేంద్ర, సంధ్య, జిల్లా సరఫరా అధికారి శివ ప్రసాద్, జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగు అధికారి ఎల్. అశోక్ కుమార్, మిల్లర్లు, రవాణా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

అక్రమ అరెస్టులకు ఖండన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పూర్ణపాడు – లాబేసు వంతెన పూర్తి చేయాలని కొమరాడ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన వివిధ పార్టీల నాయకులను అరెస్టు చేయడం విచారకరమని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ అన్నారు. గత కొన్నేళ్ల నుంచి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని స్థానిక ప్రజలు, వివిధ పార్టీలు నాయకుల కోరుతున్న ప్రభుత్వం నేటికీ వంతెన పూర్తి చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో ఆందోళన చేపట్టిన సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణుతో సహా 9 మందిని అరెస్టు చేయడం పట్ల అవినాష్ ఖండించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేయడం అంటే హక్కులను కాలరాయడమే అన్నారు.

సీతంపేట : పూర్ణ పాడు లాబేసు వంతెనను పూర్తి చేయాలని 10 రోజులు రిలే నిరాహార దీక్షలు చేసి సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తదుపరి రిలే నిరాహార దీక్ష సాధన కమిటీ నాయకులు అరెస్ట్ చేయడం అన్యాయమని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు ఖండించారు. ఈ పోరాటాన్ని ప్రభుత్వ యంత్రాంగం అరెస్ట్ చేయడం వల్ల పోరాటం ఆగదని అధ్యక్షులు అన్నారు.



పనుల ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకుంటున్న పిఒ విష్ణుచరణ్

గడప గడపకు పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలని, పూర్తయిన ప్రాధాన్యత భవనాలను వెంటనే అప్పగించాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ మండల ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యత భవనాలు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులు నిర్మాణ పరిస్థితులపై సాలూరు, పాచిపెంట మండలాల ఇంజనీర్లతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తయిన, జరుగుతున్న పనుల గూర్చి అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవనాలను పది రోజుల్లో అప్పగించాలని ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులన్నింటినీ పూర్తి చేయాలని, పనులు ప్రారంభం కాని చోట్ల వెంటనే పనులు మొదలు పెట్టాలని అన్నారు. పూర్తయిన పనులకు వెంటనే బిల్లులను అప్లోడ్ చేయాలని తెలిపారు. పనులు పూర్తి చేసి బిల్లులు సమర్పించిన వారికి సకాలంలో పేమెంట్స్ జరుగుతున్నాయని, కావున సకాలంలో పనులు పూర్తి చేసి బిల్లులు పొందాలని సూచించారు. సమావేశంలో మండల ఇంజనీరింగ్ అధికారులు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఓట్ల తొలగింపు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే ఓటర్ల తొలగింపు ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. ఓటరు పునఃశ్చరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఇంటింటికి ఓటరు నమోదు ప్రక్రియను పట్టణంలోని 32, 38 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల జాబితాను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మృతి చెందిన ఓటర్లు, శాశ్వత వలసలు, డబుల్ ఎంట్రీ ఓటర్లు తొలగింపు విధానాన్ని పరిశీలించారు. ఓటర్ల తొలగింపు ప్రక్రియలో ఫామ్ 13 నోటీస్ జారీ చేయాలని, శాశ్వత వలసల ఓటర్లు, మరణించిన ఓటర్ల పంచనామా ను బూత్ స్థాయి అధికారులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. మరణించిన ఓటర్ల ఆధార్ కార్డును నమోదు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిదిలోని బూత్ స్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.శివన్నారాయణ, డిటి వెంకటరమణ, పంచాయితీరాజ్ ఎఇ చంద్ర మౌళి , రెవెన్యూ అధికారి రామకృష్ణ, బూత్ స్థాయి అధికారులు సంధ్యా, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు సర్వే నిర్వహించాం : పిఒ

సీతంపేట : ఇంటింటికి చేపడుతున్న ఓటరు సర్వేను పూర్తి పారదర్శకంగా నిర్వహించామని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఓటరు సర్వే చేపట్టామన్నారు. నిబంధనల ప్రకారమే ఓట్లను తొలగించామని, కొత్తగా ఓటరుగా నమోదు కోసం వచ్చిన వాటిని వెంటనే నమోదుకు చర్యలు తీసుకొంటామని అన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు వంటివి చేపడతామన్నారు. ఒక కుటుంబంలో ఉన్న ఓట్లన్నీ ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్లకు సూచించారు. కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుపై వచ్చిన వినతులను పరిశీలించి అవసరమైతే ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గ మండలాల తహశీల్దార్లు, ఇతర ఎన్నికల సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు తొలగింపుల వివరాలు పరిశీలించాలి

పార్వతీపురంరూరల్ : ఓటరు తొలగింపుల వివరాలు పరిశీలించాలని రాజకీయ పార్టీలను రెవిన్యూ డివిజనల్ అధికారి, పార్వతీపురం నియోజక వర్గం ఓటరు నమోదు అధికారి కె.హేమలత కోరారు. ఓటరు పునశ్చరణ కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళ వారంతన కార్యాలయంలో సమావేశం నిర్వహించి వివరించారు. శాశ్వత వలసలు, మృతి చెందిన వారు, డూప్లికట్ ఎంట్రీలు గల ఓటర్లను జాబితా నుండి తొలగిస్తున్నామని చెప్పారు. తొలగించిన వాటిని పరిశీలించి వాటిలో లోపాలు ఉన్నా, లేదా ఇతర అంశాలు ఉంటే తెలియజేయాలని కోరారు. తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయుటకు కృషి చేస్తున్నామని అందుకు రాజకీయ పార్టీలు కూడా సహకరించాలని అన్నారు. నియోజవర్గంలోని దాదాపు అన్ని గృహాలను పరిశీలించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

తప్పల్లేకుండా ఆన్‌లైన్ చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ లాండ్ రికార్డ్స్ అండ్ సర్వే (ఎఫ్.పి.ఓ.ఎల్.ఆర్)లో భాగంగా చేపడుతున్న ఆన్ లైన్ డేటా ఎంట్రీలో ఎటువంటి తప్పులు ఉండరాదని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు అన్నారు. పార్వతీపురం డివిజన్ తహశీల్దార్లు, హెచ్.డిటిలు, రీ సర్వే డిటిలు, మండల సర్వేయర్లు, కంప్యూటర్ ఆపరేటర్లుకు శిక్షణా కార్యక్రమం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో మంగళ వారం జరిగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ తప్పుగా డేటా ఎంట్రీ చేస్తే విఆర్ఒ నుంచి తహశీల్దార్ వరకు బాధ్యత వహిస్తారన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు తక్షణం చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. రీ సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేస్తోందని, దాని ప్రాధాన్యతను గుర్తించి అంకిత భావంతో పనిచేయాలని ఆయన అన్నారు. తప్పులు లేని భూ రికార్డుల తయారీలో మన భాగస్వామ్యం ఉండటం గర్వకారణంగా భావించాలని ఆయన చెప్పారు. రీ సర్వేలో ఉన్న అన్ని అంశాల పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. రీ సర్వేలో జిల్లా ఆదర్శంగా నిలవాలని అందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేయాలని ఆయన పేర్కొన్నారు. శిక్షణా కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.హేమలత పాల్గొన్నారు.



సాలూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ఇసుక అక్రమాలపై చర్యలు తీసుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి - సాలూరు

అధికారపార్టీ నాయకుల అండతో జరుగుతున్న ఇసుక మాఫియా అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి నాయకులు కార్యకర్తలు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ ఆధ్వర్యాన మండల నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్నారు. సిఎం జగన్ నివాసం పక్కనే ఇసుక దందా జరుగుతున్నా చర్యలు లేవని ఆరోపించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మండల పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేష్, కౌన్సిలర్ వి.హర్షవర్ధన్ పాల్గొన్నారు.

సీతానగరం: ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని కోరుతూ స్థానిక తహశీల్దార్‌కు పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బోనెల విజయ్‌చంద్ర, మాజీ ఎమ్మెల్సీ ద్వారపూడి జగదీష్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొల్లి తిరుపతి రావు, రౌతు వేణుగోపాలనాయుడు, పార్టీ నాయకులు జి.వెంకటనాయుడు, ఎస్.హరిగోపాలరావు, డి.భానుప్రసాద్, బి.శ్రీనివాసరావు, సబ్బాన శ్రీనివాసరావు, దొగ్గ మోహన్ రావు, బురాడ చిరంజీవి పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని అక్రమ ఇసుక క్వారీల ద్వారా దందా జరుగుతుందని దీనిని వెంటనే అరికట్టాలని స్థానిక ఉపతహశీల్దార్ ఇబ్రహీంకు వినతి పత్రం అందజేశారు. మండల టిడిపి అధ్యక్షులు జి,వేణుగోపాలరావు సీనియర్ నాయకులు మావుడి ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

పాచిపెంట : మండలంలోని అక్రమ ఇసుక క్వారీల ద్వారా దందా జరుగుతుందని దీనిని వెంటనే అరికట్టాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలోని ఆర్ఐ బి.రమణారావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పిన్నింటి ఈశ్వరరావు, గూడెపు యుగంధర్, ముఖీ సూర్యనారాయణ, దండి మోహన్ రావు, పల్లెటూరు ఉమామహేశ్వరరావు, కొత్తల పోలినాయుడు పాల్గొన్నారు.

క్రీడలతో కీర్తి : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

క్రీడలతో కీర్తి ప్రతిష్టలు లభిస్తాయని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా ప్రతిభా పురస్కారాలు ప్రధాన ఉత్సవం మంగళ వారం స్థానిక ఆర్‌సిఎం ప్రాంగణంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేజర్ ధ్యాన్ చంద్ చిత్ర పటానికి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ గొప్ప హాకీ క్రీడాకారుడని, ఒలింపిక్ స్వర్ణ పతకాలను అందించిన భారత ముద్దు బిడ్డ అన్నారు. హాకీలో విశేషమైన ప్రతిభ కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు. క్రీడల్లో విద్యార్థులు ముందంజ వేయాలని, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభా పాటవాలు చూపాలని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు సైతం ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా క్రీడా ప్రతిభా పురస్కారాలు ప్రధానం చేశారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, వ్యాయమ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రెండో రోజు ట్రైనీ ఐఎఎస్‌ల బృందం పర్యటన

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలోని పూతికవలసలో ట్రైనీ ఐఎఎస్‌ల బృందం మంగళవారం పర్యటించి గ్రామ పెద్దలతో మాట్లాడారు. గ్రామం పుట్టు పూర్వోత్తరాలు, గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు, కళల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకున్నారు వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే బిపిఎల్ కేటగిరీలో ఉన్న వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐఎఎస్‌లు వైశాలి, అభిషేక్, సింధు, తూషాలీ, పీయూష్ కుమార్, ఏటిడబ్ల్యూఒ మంగవేణి, వెలుగు సిబ్బంది ఉన్నారు.

భామిని.: ట్రైనీ ఐఎఎస్ బృందం మంగళవారం కోసిమ్ కాలనీ, బొడ్డగూడ గ్రామాలను పరిశీలించింది. ఈ సందర్భంగా స్థానికంగా గిరిజన గ్రామాల ఏర్పాటు, గతం లో జీవనం ఎలా సాగించారు, గిరిజన కుటుంబ వ్యవస్థ, వివాహ వ్యవస్థను గ్రామపెద్దలను అడిగి తెలుసుకున్నారు. వన్ దన్ వికాస్ కేంద్రాల ద్వారా గిరిజనులు తయారు చేస్తున్న కొండ చీపుర్ల యూనిట్ ను పరిశీలించారు. కార్యక్రమం ఎంపిడిఒ జి. చంద్రరావు, ఎపిఒ దొడ్ల భవాని, గిరిజన ఆశ్రమం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బిడ్డికి రవి, సచివాలయం సిబ్బంది, సర్పంచ్ మార్తా ఉన్నారు.



వెరిఫికేషన్ కోసం సచివాలయం వద్ద ఎండలో నిరీక్షిస్తున్న మహిళలు

'చేయూత'కోసం మండుటెండలో నిరీక్షణ

ప్రజాశక్తి - కలెక్టర్

మహిళలకు ప్రతి ఏటా ప్రభుత్వ అందిస్తున్న వైయస్సార్ చేయూత పథకం కోసం ఇప్పటికే జిల్లాలో అనేక మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి వెరిఫికేషన్ చేయాలని పై స్థాయి అధికారులు ఇప్పటికే గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లకు దిశ నిర్దేశం చేసినప్పటికీ చాలామంది వెల్ఫేర్ అసిస్టెంట్లు గ్రామాల్లోని ఇళ్లకు వెళ్లకుండా మహిళలందరినీ సచివాలయానికి పిలిపించి వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని అడ్డాపుశీల సచివాలయ పరిధిలో గల ఐదు గ్రామాల మహిళలను వెరిఫికేషన్‌కు మంగళవారం ఇక్కడకు వచ్చారు. సచివాలయానికి దూరంగా ఉన్న గ్రామాల్లోని మహిళలంతా ఒకేరోజు రావడంతో వారు నిలబడ్డానికి కూడా స్థలం లేక బయట మండుటెండలో గొడుగులు వేసుకొని నిల్చొని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆ సచివాలయం పరిధిలో గల మహిళలు తమ వద్దకు వచ్చి వెరిఫికేషన్ చేయాలి కదా అని ప్రశ్నించగా సదరు వెల్ఫేర్ అసిస్టెంట్ గ్రామాల్లో నెట్వర్క్ సమస్య ఉందని అందువల్ల వెరిఫికేషన్ ప్రక్రియను సచివాలయంలో ఉన్న వైఫై సౌకర్యం తో సులభంగా పూర్తి అవుతుందని చెప్పారు. దీంతో మహిళలంతా సచివాలయాల వద్దనే నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే విషయంపై అధికారులను ప్రశ్నించగా వెరిఫికేషన్ ప్రక్రియ గ్రామాల్లోని వెళ్లి చేయాలనీ వెరిఫికేషన్ సమయంలో ఎటువంటి నెట్వర్క్, ఆన్లైన్ చేయాల్సిన పనిలేదని వివరణ ఇచ్చారు. కాగా ఇదంతా స్థానిక వెల్ఫేర్ అసిస్టెంట్ తన పని భారం తగ్గించుకోవడానికి మహిళలను ఇబ్బంది పెట్టే ఆలోచనతో కేవలం ఈ పని చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేస్తున్న డిఆర్‌ఒ వెంకట్రావు

ప్రజాశక్తి - పార్వతీపురం

తెలుగు భాషా దినోత్సవం జిల్లాలో ఘనంగా జరిగింది. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్ర పటానికి డిఆర్‌ఒ జె.వెంకటరావు, జిల్లా అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి, పుష్ప మాలాలంకరణ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషాశాస్త్రవేత్త, పరిశోధకుడు, గ్రంథపరిష్కర్త, శాసనపరిష్కర్త, పత్రికా రచయిత, ప్రజాస్వామ్యవాది, మానవతావాది గిడుగు వేంకట రామమూర్తి పంతులని కొనియాడారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోనికి తీసుకొచ్చిన మహనీయుడు అచ్చతెలుగు చిచ్చర పిడుగు గిడుగు అని ప్రశంసించారు. కేవలం భాషోద్యమానికే పరిమితం కాకుండా, పర్లాఖిమిడి దగ్గర కొండ ప్రాంతంలో నివసించే "సవర" కోసం తను సవరభాష నేర్చుకొని, వాచకాలు రాసి, నిఘంటువును తయారు చేసి, తన సొంత ధనంతో బడులు పెట్టించి 30ఏళ్ళ వారికి విద్యాబోధన చేశారని వివరించారు. గిడుగు భాషా ఉద్యమానికి గౌరవం పట్టిన గొప్పవ్యక్తి గురజాడ అని, వీరి బంధం అపూర్వం, అనిర్వచనీయమని చెప్పారు. మాతృ భాష మానవ మనుగడకు కీలకం అన్నారు. మాతృ భాషను విస్మరించరాదని, మాతృ భాష అంటే అమ్మ భాష అన్నారు. మాతృ భాష విస్తరిని కొనసాగిద్దామని, అందుకు ఇంటిలో తెలుగు భాషను మాట్లాడుతూ ఇంటి నుండి ప్రగతి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, టిపిఎంయు ఎపిడి వై.సత్యం నాయుడు, జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి ఎల్. అశోక్‌కుమార్, జిల్లా కలెక్టర్ కార్యాలయ పాలన అధికారి ఆర్. ఉమామహేశ్వర రావు, పర్యవేక్షకులు శ్రీరామ మూర్తి, రవి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి ఎపిఒ రోసిరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ మేరకు జాతీయ క్రీడా దినోత్సవం కూడా ఘనంగా నిర్వహించారు. మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పిఎ హరికృష్ణ, డిప్యూటీ ఎస్ఒ అప్పారావు, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానంద్, జిసిడిఒ రాములమ్మ, ఎస్ఒల చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు వైస్ ప్రిన్సిపాల్, సిబ్బంది బహుమతులు ప్రదానం చేశారు.

గుమ్మలక్ష్మీపురం: స్థానికప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా వారోత్సవాల ముగింపులో భాగంగా తెలుగు శాఖ నిర్వహించిన గిడుగు వెంకట రామమూర్తి జయంతిని ఘనంగా నిర్వహించుకొని, కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శ్రీ వరం అధ్యక్షతన పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాలలో తెలుగు భాష వారోత్సవాలు ఈనెల 23 నుండి నేటి వరకు అనేక కార్యక్రమాలను నిర్వహించామని అన్నారు. అందులో విజేతలకు బహుమతి ప్రదానోత్సవాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామయ్య, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు గిడుగు రామ్మూర్తి వేషధారణ వేసి తెలుగు ప్రాముఖ్యం, ప్రాముఖ్యతపై విద్యార్థులకు హెచ్ఎం పాలక దేవానంద్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహోపాధ్యాయులు జె.సుబ్బారావు ఉన్నారు. అలాగే స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్. శ్రీరంజని తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనం, దాని ఆవశ్యకతను వివరించారు. అలాగే నేడు జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలను, క్రీడలను నిర్వహించి బహుమతులను అందజేశారు. తెలుగు భాష గొప్పతనాన్ని పురస్కరించుకొని విద్యార్థులు వివిధ రూపాల్లో నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సవర భాష అభివృద్ధికి గిడుగు కృషి అమోఘం

పార్వతీపురం రూరల్ : సవర భాష అభివృద్ధికి ఆ రోజుల్లో గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి దేశ యావత్తూ తెలుగు భాష గురించి ఆలోచింప చేసిందని తెలుగు ఉపాధ్యాయులు పి దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక వేదాంత జూనియర్ కళాశాల ఆవరణలో స్నేహకళా సాహితీ ఆధ్వర్యంలో జరిగిన తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమంలో ప్రధాన వక్తగా ఆయన మాట్లాడారు. తెలుగు భాషా దినోత్సవానికి మూలకారకుడైన గిడుగు రామ్మూర్తి పంతులు జీవిత విశేషాలను వివరించిన తీరు సభికులను ఆకట్టుకుంది. శ్రీకాకుళం జవహర్ నవోదయ విద్యాలయం మాజీ తెలుగు బోధకులు జి.చిన్నమనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్వతీపురానికి చెందిన ప్రముఖ కవులు రచయితలు గంటేడ గౌరినాయుడు, మల్లిపురం జగదీష్, పక్కి రవీంద్రనాథ్, చందనపల్లి గోపాలరావు, చుక్క పారినాయుడు, ఎంవిఆర్ శర్మ, నాగు కాకిముక్కల, దొడ్లంకి గణపతి రావు, శ్రీవాణి ఆర్ట్స్ పిజె నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శివున్నాయుడు మాట్లాడుతూ తెలుగు భాషను రక్షించుకునే బాధ్యత విద్యార్థులపైనే ఉందన్నారు. క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : స్థానిక ప్రభుత్వజూనియర్ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ జంజేటి రామారావు ముందుగా తెలుగుతల్లితో కూడిన గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలతో వేశారు. అనంతరం వ్యవహారిక తెలుగుభాషా పితామహుని గురించి, తెలుగుభాషా గొప్పతనంగురించి కొనియాడారు. సమావేశంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కృష్ణపల్లిలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు తన కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం భాషా సేవ గురించి ఆయన కృషి చేసిన విషయాలను గుర్తుకు తెచ్చుకున్నారు.

బలిజిపేట : వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి, జాతీయ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి వేడుకలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ సామల సింహాచలం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత ఎంఇఒ, హెచ్ఎం జయప్రసాద్ గిడుగు, ధ్యాన్ చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినిలు ప్రదర్శించిన భువన విజయం నాటకం, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలను నిర్వహించిన తెలుగు ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో తెలుగు వాడుక భాషోద్యమ పితమహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయల సంస్థ కార్యదర్శి బుర్రి కుమారరాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు పదాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి నిత్య వ్యవహారంలోని భాషల్లో ఉన్న అందాన్ని వీలును తెలిపిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ కోరాడ చిరంజీవి మరియు ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, పాఠకులు భాస్కరరావు, మధుసూదనరావు సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు. పట్టణంలోనివెంకంపేట వీధి ఎంపీయూపీ పాఠశాలలో హెచ్ఎం జి.పరాంకుశంనాయుడు తెలుగు భాషా దినోత్సవం,జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన ,వక్తృత్వ ,చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్ గురించి విద్యార్థులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని సి హెచ్ కమల కుమారిని సన్మానించారు.

భామిని : స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ ఆధ్వర్యంలో క్రీడ, బాషా దినోత్సవాలును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు క్రీడా దినోత్సవం, తెలుగు భాష దినోత్సవం వచ్చేలా అక్షర మాలలో కూర్చొని చూపించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసరావు,వ్యాయమ ఉపాధ్యాయులు జి. శివరాం, ఉపాధ్యాయ సిబ్బంది వున్నారు.

గరుగుబిల్లి: మండలంలోని కొంకడివరం మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు వేంకట రామమూర్తి చిత్ర పటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పక్కి రవీంద్రనాథ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండలంలోని తెలుగు భాష దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని చిదిమి ఎంపియుపి పాఠశాలలో ఉపాధ్యాయులంతా సంప్రదాయ వస్త్రాలతో తెలుగు తల్లి గిడుగు రామ్మూర్తి ప్రాచీన కవులు వేషధారణ ధరించారు. జానపద కళ అయినా విద్యార్థులు తప్పిడుగులతో ప్రదర్శన నిర్వహించారు. తెలుగు భాష గురించి నినాదాలతో గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల శ్రీహరినాయుడు, తెలుగు ఉపాధ్యాయుల సంతోష్ కుమార్ స్వామి, హిమాం ప్రభావతి, శకుంతల ,తదితరలు తమ అమూల్య సందేశాన్ని విద్యార్థులకు అందజేశారు.


భామినిలో తెలుగుభాష దినోత్సవం అక్షరమాలలో ఉన్న విద్యార్థులు


పాలకొండ : గిడుగు చిత్రపటానికి పూలమాల వేస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి


సీతానగరం : తెలుగుతల్లి వేషాధరణలో ఉన్న విద్యార్థినులు



గుమ్మలక్ష్మీపురం కెజిబివి పాఠశాలలో తెలుగు భాషాదినోత్సవంలో విద్యార్థులు


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు అక్కివరపు మోహనరావు

జనసేన ఆధ్వర్యంలో రోగులకు పండ్ల పంపిణీ

ప్రజాశక్తి- పార్వతీపురం

జనసేన అధినేత పవన్ కల్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో మంగళవారం పార్వతీపురం నియోజకవర్గ నాయకులు అక్కవరపు మోహన్ రావు సౌజన్యంతో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుండి సెప్టెంబర్ 2వరకు జనసేన నేత పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా వారోత్సవాలు తమ పార్టీ తరపున జరుపుతున్నామన్నారు. ఈ వారం రోజులు నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో ఏదో ఒక కార్యక్రమం జరుపుతున్నామని, పవన్ కల్యాణ్ పుట్టినరోజున భారీ బైక్ ర్యాలీ నిర్వహించబోతున్నామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆగూరు మణి మాట్లాడుతూ రాజానబాలు, ఖాతా విశ్వేశ్వరావు, గుంట్రెడ్డి గౌరీశంకర్, అల్లు రమేష్, బొండపల్లి జనార్ధన, కర్రి మణికంఠ, చిట్లి గణేశ్వర రావు, పెద్దసంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నియామక పత్రం అందుకుంటున్న జోగారావు

మత్స్యకారుల సంఘం అధ్యక్షులుగా జోగరాజు

ప్రజాశక్తి - పాచిపెంట

పెద్ద గెడ్డ జలాశయం మత్స్యకారుల సంఘం అధ్యక్షులుగా బొచ్చుల జోగరాజు ఏకైగ్రీవంగా ఎన్నికయ్యారు. పెద్దగెడ్డ జలాశయం మత్స్యకారుల అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ఎఫ్‌పిడిఒ డి.గోపీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం కోడికాళ్లవలస సామాజిక భవనం వద్ద నిర్వహించారు. ఈ ఎన్నికకు 113 మంది మత్స్యకారులు హాజరై బొచ్చుల జోగరాజు అధ్యక్షునిగా ఉపాధ్యక్షునిగా బద్నానా సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి డి.గోపీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, కేసలి సర్పంచ్ ప్రతినిధి ఎస్.రాము సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రంగంపేట సర్పంచ్ రాజీనామా

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రంగంపేట పంచాయతీ సర్పంచ్ బొంగు భాస్కరరావు, ఉపసర్పంచ్ ఎం.సత్యనారాయణ మంగళవారం తమ పదవులకు రాజీనామా చేస్తూ ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్ కు రాజీనామా పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ రాజీనామాన్ని ఆమోదించాలని వారు తెలిపారు.

గోదాముల నిర్వహణ సక్రమంగా ఉండాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సివిల్ సప్లైస్ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎంఎల్ఎస్ గోధుమల నిర్వహణ సక్రమంగా ఉండాలని సివిల్ సప్లైస్ విశాఖ మేనేజర్ కె.సుబ్బరాజు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంఎల్ఎస్ గోదాములను ఆకస్మికంగా పరిశీలించారు. సివిల్ సప్లై శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోదాములను ఎప్పటికప్పుడు స్టాక్ పాయింట్లను, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎక్కడైనా తేడాలు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామయన్నారు. ఎంఎల్ఎస్ గోదాం నిర్వహణను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తపరిచారు. ఆయన వెంట స్థానిక జిసిసి బ్రాంచ్ మేనేజర్ కృష్ణ ప్రసాద్, గోదాం ఇన్చార్జ్ ఎం. సాంబశివరావు తదితరులు ఉన్నారు.

వికలాంగులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక ప్రభుత్వ గవర్నమెంట్ జూనియర్ కళాశాల మైదానం మంగళవారం వికలాంగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను డిఇఒ ఎస్.ప్రేమ్‌కుమార్ అందజేసినట్టు ఐసిఆర్‌టి పి.వీర్రాజు తెలిపారు. ఇటీవల మండల స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులను పార్వతీపురంలో నిర్వహించిన ఆటలు పోటీలకు తీసుకెళ్లామన్నారు. మండలం నుంచి 8 మంది దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారన్నారు.

ఆ రెండు శాఖలపై గరం గరం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఎంపిడిఒ వివి శివరామప్ప ఆధ్వర్యంలో ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రజాశక్తిలో ఇటీవల ప్రచురితమైన 'పాఠశాలలో తనిఖీలు జరిగేనా.. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందేనా' అన్న శీర్షికతో వెలువడిన కథనానికి సమావేశంలో చర్చ జరిగింది. మండల విద్యాశాఖ అధికారి తమ శాఖ ప్రగతిని వివరిస్తుండగా మండల కోప్షన్ సభ్యులు షేక్ జిలాని కలుగజేసుకొని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలానే లక్ష్యంగా పనిచేస్తున్నప్పటికీ అధికారులు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో మధ్యాహ్న భోజనం సరుకులు పక్కదారి పడుతున్నాయని, దీంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందక ఇంటికి వచ్చి వెళ్తున్నారని అన్నారు. ఐసిడిఎస్ అధికారుల పర్యవేక్షణ లోపంవల్ల అంగన్వాడీ కేంద్రాల్లో సరుకులు గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు అందజేయాల్సిన సరుకులు సక్రమంగా అందకుండా బహిరంగ మార్కెట్లో లభ్యమవుతున్నాయని తెలిపారు. దీనివల్ల సిబ్బంది పర్యవేక్షణ లోపం లేకపోవడమేనని, కిశోర బాలికలకు, లబ్ధిదారులకు టేక్ హెూమ్ రేషన్ పంపిణీలో అవకతవకలపై మొండెంఖల్ సర్పంచ్ ఐ.గౌరీశంకర్, పలువురు సర్పంచులు ఐసిడిఎస్ సిబ్బందిని నిలదీశారు. ఎంపిపి శెట్టి పద్మావతి మాట్లాడుతూ అధికారులంతా సమస్యలు పరిష్కరించే దిశగా పనిచేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా అధికారులు చూస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని అన్నారు. అలాగే ఐసిడిఎస్ సిబ్బంది కూడా పర్యవేక్షణ సక్రమంగా చేసి గర్భిణీలకు, బాలింతలకు పిల్లలకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ సిబ్బందికి ఆదేశించారు. అనంతరం కొత్త ఎన్నికైన గుమ్మ సర్పంచ్‌గా గెలుపొందిన ఆరిక గోపాలరావుచే ఎంపిడిఒ వివి శివరామప్ప ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జడ్పిటిసి జి.సుజాత, వైస్ ఎంపీపీలు అన్నాజీరావు, రంగారావు, ఎంపీటీసీలు, సర్పంచులు, కొందరు అధికారులు పాల్గొన్నారు.

'ప్రజాశక్తి' కథనంపై వాడీవేడి చర్చ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పద్మావతి


కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

జ్యూట్ మిల్లును తక్షణమే తెరిపించాలి

దీక్షలకు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు సంఘీభావం

ప్రజాశక్తి -సాలూరురూరల్

లాక్ డౌన్ ప్రకటించిన ఎపి ఫైబర్స్ జ్యూట్ మిల్లును వెంటనే తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులు చేస్తున్న దీక్షలకు మద్దతుగా ప్రజాసంఘాలు, యుటి ఎఫ్ ప్రతినిధులు బి.విజయ్ కుమార్, ఎ.గణేష్, ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు ముక్తేశ్వర పాణిగ్రహి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కార్యదర్శి ఎన్వై నాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది చిట్టి, రూరల్ అధ్యక్షులు ఆముదాల పరమేష్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిల్లును వెంటనే తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉన్న ప్రాధాన్యత, ఉపాధి అవకాశాలను నిర్వీర్యం చేస్తున్నారని, మిల్లును గత 15నెలలుగా మూత పడ్డా నేటికీ దీని గురించి స్థానిక మంత్రి దృష్టి పెట్టకపోవడం శోచనీయమన్నారు. రాబోయే రోజుల్లో కార్మికుల పోరాటాలకు తమ తరుపున సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు రాముడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మర్రి శ్రీనివాసరావు, ప్రజాసంఘాల నాయకులు గౌరీశంకర్, ప్రభాకరరావు, ఎ.తిరుపతిరావు, శ్రీనివాసరావు, జెఎసి నాయకులు తిరుపతి, సురప్పాలనాయుడు, నారాయణ రావు, శ్రీనివాసరావు, సుదర్శన రావు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీపై కార్యకర్తలకు అవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలోని టిడిపి క్రియాశీలక నేతలకు, మండల, పట్టణ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జిలు, ఐటిడిపి సభ్యులకు మంగళవారం లయన్స్ కల్యాణ మండపంలో బాబుతో భవిష్యత్తు కు గ్యారంటీ అనే కార్యక్రమంపై శిక్షణను సాయంత్రం నిర్వహించారు. సెప్టెంబర్ 1 నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమం గూర్చి నియోజక వర్గం ఇన్‌చార్జి విజయ్ చంద్ర, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డి.జగదీష్ వివరించారు. రానున్న సాధారణ ఎన్నికల్లో అంతా కలిసికట్టుగా ఉండి కష్టపడి పనిచేసి వైసిపిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, టిడిపి నాయకులు జి.వెంకటనాయుడు, బార్నాల సీతారాం, కొల్లి తిరుపతిరావు, దొగ్గ మోహన్, రవికుమార్, పెంకి వేణుగోపాలనాయుడు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పిఎం కిసాన్ నమోదుకు చర్యలు : ఎఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఖరీఫ్ సీజన్‌కు పెట్టుబడిసాయం క్రింద అందించే పిఎం కిసాన్ పథకం అర్హులైన రైతులకు వర్తించేలా రైతుల భూములకు సంబంధించిన ఖాతా నెంబరుకు ఆధార్ నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని మండల వ్యవసాయ అధికారి రేగిడి విజయభారతి తెలిపారు. ఈమేరకు తన కార్యాలయంలో మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతుల భూముల వివరాలను వెబ్ ల్యాండ్‌లో నమోదయ్యేలా గ్రామ రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఖాతా నెంబర్‌కు ఆధార్ నెంబరు అనుసంధానం కాకపోతే రైతులకు ఆర్థిక సహాయం అందే అవకాశం లేదన్నారు. మండలంలో దాదాపు 348 మంది రైతులకు సంబంధించిన వివరాలను అప్డేట్ చేయాల్సి ఉందన్నారు.

అచ్చిప్పవలస ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని అచ్చిప్పవలస గిరిజన గ్రామంలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి ఉమామహేశ్వరి వివిధ రకాల రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఓ శాంతి కుమారి, ఎఎన్ఎం రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పి, ఆశా కార్యకర్తలు, 104సిబ్బంది పాల్గొన్నారు.

చర్యలు శూన్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యంలో గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు పాలక రంజిత్ కుమార్ అన్నారు. గిరిజన విద్యార్థులు చిన్న చిన్న వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల బారినపడి మరణిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు శూన్యమన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల సేవలను నిలుపుదల చేశారని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచలేదన్నారు. గత సంవత్సరం డైట్ బిల్లులు నేటికీ ఇవ్వని పరిస్థితి ఉందన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మున్సిపల్ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బోనుగౌరీశ్వరి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అజెండాలోని పొందుపరిచిన 20 అంశాలను మున్సిపల్ అధికారి చదివి వినిపించగా, పురపాలక సంఘం పరిధిలో నిర్వహించ తలపెట్టిన పలు అభివద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. జీరో అవర్‌లో పాత బస్టాండ్ సిసి రోడ్డుపై వేసిన క్రషర్ బుగ్గి వల్ల ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు పలు ప్రభుత్వ నిధులు ఉండగా మున్సిపల్ సాధారణ నిధులను ఖర్చు పెట్టడం ఏమిటని 14వ వార్డు టిడిపి కౌన్సిలర్ ద్వారపు రెడ్డి శ్రీదేవి ప్రశ్నించారు. కొత్తవలసలో 5, 6, 7, 8 వార్డుల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయ జరుగుతుందని, రెండో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, అలాగే పట్టణంలో మహిళలకు పలుప్రాంతాలలో సులభ కాంప్లెక్స్ నిర్మాణం చేయాలని, వార్డుల్లో పారిశుధ్యానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని 8వ వార్డు టిడిపి కౌన్సిలర్ నారాయణరావు కోరారు. అన్ని వార్డుల్లోనూ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించిన పురపాలక యంత్రాంగం వచ్చే సెప్టెంబర్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పూర్తి స్థాయిలో అన్ని కాలువలు శుభ్రం చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు, ఫ్లోర్ లీడర్, పలువురు కౌన్సిలర్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

గిరిజనులకు భూములు అప్పగించాలి

ప్రజాశక్తి - బెలగాం

అనేక ఏళ్లుగా దీర్ఘకాలంగా సాగు చేసుకుంటున్న గిరిజన వితంతు మహిళలకు భూములు అప్పగించాలని వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి పి.రాము ఆర్‌డిఒ కె.హేమలతకు మంగళవారం వినతిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని ములగ గ్రామపంచాయతీ లచ్చన్నదొరవలసకు చెందిన గిరిజన వితంతు బుయ్యాన నారాయణమ్మ, మర్రి బాణమ్మకు సర్వే నెంబరు 26లో సీలింగ్ భూమికి వారి భర్తల పేరున పట్టాలు ఉన్నాయన్నారు. ఆ భూమిని తమ పేరున మార్చమని స్థానిక విఆర్‌ఒ శంకరరావుకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని తెలిపారు. ఈ భూమి కోర్టు కేసులో ఉండడం వల్ల మ్యుటేషన్ చేయడమవ్వదని చెప్తున్నారని తెలిపారు. తాము సాగు చేసుకుంటున్న భూమిని ఎవరీ అమ్మలేదని, అలాంటిది కోర్టు కేసులో ఉందని ఎలా చెప్తారు అని విఆర్‌ఒను అడగ్గా తహశీల్దార్, పై అధికారుల మీదకు నెట్టివేస్తున్నారని అన్నారు. తాము గిరిజనులం కావడంతో తమను పలుమార్లు తిప్పుతూ సమస్య పరిష్కారం చేయకుండా కాలయాపనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఆర్‌డిఒ స్పందించి వెంటనే ఈ భూమికి తమను పేరును పట్టా ఇవ్వాలని కోరారు.

విద్యార్థుల్లో రక్త హీనత నివారణకు చర్యలు

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన మండలంలోని ఎంఆర్ నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను మంగళవారం సందర్శించారు. ఇప్పటివరకు ఎంత మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు నిర్వహించారు, ఎంత మందిని రక్తహీనతగా గుర్తించడం జరిగిందని సిబ్బందిని ఆరా తీశారు. విద్యార్థుల హీమోగ్లోబిన్ శాతం నమోదు రికార్డులు ఆయన పరిశీలించి తక్కువగా ఉన్న విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య పరిశీలన చేశారు. వారిలో రక్తహీనత లక్షణాలు ఏ మేరకు ఉంటున్నాయని పరీక్షించారు. అందుకు కారణమైన అంశాలపై ఆరా తీసి తగు సూచనలు చేశారు. ప్రతి రోజూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయించాలని సిబ్బందికి సూచించారు.

108 వాహన సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

108 వాహనం ద్వారా ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా సిబ్బందికి ఎప్పటికప్పుడు శిక్షణ ఇచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులో తెస్తున్నట్టు ట్రైనర్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జిల్లా కేంద్రాసుపత్రిలో 108 ఇఎంటిలకు శిక్షణ నిర్వహించారు. నూతన కార్డిక్ వాస్కులర్(హృద్రో రోగాలు) ఎమర్జెన్సీస్‌లో ఎలా రక్షణ కల్పించాలి అనే అంశాలు గురించి శిక్షణ, తరగతులు ఇఎంటిలకు అవగాహన కల్పించారు. శిక్షణా తరగతుల్లో 108 జిల్లా మేనేజర్ మన్మధనాయుడు, ఒఇ గిరిబాబు, డివిజన్ నుండి 42 మంది ఇఎంటిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో గొటివాడ, రస్తా కుంటుబయి పంచాయతీల పరిధిలో గల ఆరు పాఠశాలల్లో చదువుతున్న ఆదివాసీ విద్యార్థులకు యూత్ ఎంపవర్‌మెంట్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి షేక్‌గౌస్ పిల్లలకు మంగళవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకాలను జడ్పీహెచ్ స్కూల్ కురుపాం పూర్వ విద్యార్థి, మాజీ నేవీ ఉద్యోగి అక్కేన రవి కిషోర్ జన్మ దినం సందర్భంగా ఆయన సహకారంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోటివాడ సర్పంచ్ టి.తట్టమ్మ, ఎంపిటిసి సభ్యులు సునీత, చైర్మన్ తులసి, మాజీ సర్పంచ్ దాలమ్మ, గ్రామ పెద్దలు కోటేశ్వరరావు, ధర్మరావు, ప్రధానోపాధ్యాయులు సత్యవతి పాల్గొన్నారు.